కథాపీఠం

పొగడదండ

— కొమ్మూరి పద్మావతీదేవి

"సీతా! సీతా!" అంటూ పున్నమ్మ వీధి గుమ్మంలో నిలబడి అటూ ఇటూ చూస్తూ పిలుస్తోంది.

"అబ్బబ్బ ఏంపిల్ల! అందరూ వస్తారేగాని ఇంటికి, అరఘంట అయింది, ఇదిమాత్రం రాదే! ఏమే! సరోజా! మాసీత కనపడిందా!"

ఆ కేకవిని ఎదురింటిలో వున్న సరోజ "వస్తోందండీ" అంటూ లోపలికి చక్కాపోయింది. "ఏం వస్తుందో, రానీ చెప్తాను" అంటూ విసుగ్గా వంట ఇంట్లోకి వెళ్ళింది పున్నమ్మ.

సీతకి పధ్నాలు గేళ్లు, అందమయింది. అమాయక మైంది. చిన్నతనంలోనే తల్లీ తండ్రీ పోవడంవల్ల మేనత్త పున్నమ్మ దగ్గిరే పెరుగుతూంది. పున్నమ్మ పంచ ప్రాణాలు సీతమీదే పెట్టుకుంది. తనకి ఉన్న ఆస్తి సీతకి ఇచ్చి ఓ ఇంటిదాన్నిచేసి మరీ ప్రాణాలు వదలాలని పున్నమ్మ ఆఖరు కోరిక.

ఒకచేత్తో పుస్తకాలు, ఇంకోచేత్తో ఏదో కాగితం పొట్లమూ పట్టుకుని పరుగున వచ్చింది సీత. "ఏమిటే ఇంతసేపు" అంది కోపంగా పున్నమ్మ.

"ఏంత సేపయిందేం? వస్తూనే ఉన్నాను" అంటూ పుస్తకాలు కింద పెట్టేలోగా చేతిలో పొట్లంజారింది.

"అవేమిటే?"

"పూలు"

"ఏం పూలు"

"పొగడ పూలు"

ఆమాటతో అత్తకోపం చల్లారింది. "ఇవి ఏరుకుంటూ కూచున్నావా నీకోసరం ఎంతసేపటినుంచో చూస్తున్నాను" అత్తమా[illegible] వినకుండానే "ఆకలే, ఏంచేశావు?" అంది సీత. ఆకలనగానే పున్నమ్మ ఆలస్యం అంతా మరిచిపోయి వంటింట్లోకి పిలుచుకు వెళ్ళింది.

2

ఆనాడు మొదలు ప్రతిరోజూ సాయంత్రం సీత బడి నుంచి ఆలస్యంగా రావడమూ పొగడపూలు తేవడమూ ప్రారంభించింది. "ఎక్కడివే ఇన్నిపూలు" అంది పట్టలేక పున్నమ్మ ఒకసారి.

"ఆంజనేయులు గుడిలోచెట్టు ఉంది అత్తా" అంది ఆలోచనగా సీత.

"నువొక్క దానివే ఏరుతున్నావా" అంది కళ్లెర్రచేసి పున్నమ్మ.

ఇంతలో ఎదిరింటి సరోజ "సీతా! రేపటిపాఠాలు ఏం చదవాలో చెబుదూ" అంటూ ఇద్దరిమధ్యన చతికిలపడింది. అత్తమాటలకి అడ్డువచ్చింది కదా అనే సంతోషంతో సీత నవ్వింది. "సరోజా! నువ్వూ ఏరుతున్నావా" అంది పున్నమ్మ మళ్ళీ. "లేదత్తా! సీతమాత్రం ఏరిందా?" అంది సరోజ. ఆమాట విని సీత కళ్ళెర్రచేసి చూసింది సరోజని. "దానికిష్టం! తెచ్చుకుంది" అంటూ మాట మార్చింది సరోజ పున్నమ్మ అలా వెళ్లగానే.

సీత నవ్వుతూ "నాకిష్టం గనుక తెచ్చుకున్నాను, నువ్వూ అత్తతో అడ్డం తగులుతావా" అంది. "అదికాదే! పూలువద్దన్నానా, అతనివ్వడాన్నిగాని! నీకు తెలియదుగాని ఈ ఊరికంతా పెద్దరౌడీ అతను, నీకు తెలుసా" అంది సరోజ.

ఆ మాటవిని ఉలిక్కిపడింది సీత; చేతిలోపూలదండ జారింది.

కొమ్మూరి పద్మావతీదేవిగారు జూలై 7, 1908 న రాజమండ్రిలో జన్మించారు. రచన వ్యాసంగం 1933 లో ప్రారంభించారు. 1939 లో తొలుత 'ప్రమాదవనం' శీర్షిక ప్రారంభించారు. ప్రముఖపత్రికలకి స్త్రీల పేజీలు రాసేవారు. తన రచనలతో 'పొగడదండ' కధానికాసంకలనం ప్రచురించారు. 'పొగడదండ' కి కేంద్రసాహిత్య అకాడెమీ బహుమతిలభ్యించింది.

"రేపు ఇస్తే వద్దనిచెప్పు" అంటూ లేచింది సరోజ.

"చదువుకోండి" అంటూ కేకలేస్తూ పున్నమ్మ వచ్చింది.

3

ఆరాత్రి ఆలోచనలతో సీతకి నిద్రరాలేదు. మర్నాడు సీత బడినుంచి వస్తూ మధ్యన ఎవరూ రావడం లేదుగదా అనే భయంతో వెనక్కి చూస్తూవస్తూ ఉండగా, ఎవరో పక్కగావచ్చి, "సీతా! సీతా!" అనగానే అదిరిపడి చూసింది. ఇంత చనువుగా తన్ను పేరుపెట్టి పిలచిన అతన్ని చూడగానే మరింత భయపడింది. సరోజ చెప్పిన రౌడి ఇతనేగదా అనే జ్ఞాపకం వచ్చి వణుకుతూ అతన్ని చూసింది. ఆ తొందరలో చేతిలో పుస్తకాలు చిందర వందరగా రోడ్డుమీద పడ్డాయి.

పుస్తకాలన్నీ తీసి సీతచేతికి అందించాడు అతను.

"ఇవిగో పూలు సీతా! సంపెంగలుకూడా" అన్నాడు నవ్వుతూ.

అతని నవ్వు ముఖాన్ని చూడగానే సీత భయంపోయి కళ్ళు పెద్దవిచేసి తేరి పారచూచింది! మళ్ళీ సరోజ మాటలూ, అత్త అరుపులూ జ్ఞాపకానికి వచ్చి 'వద్దు'

అంది మెల్లిగా, ముందుకు అడుగువేస్తూ.

"ఎందుకువద్దూ" అంటూ పూలపొట్లం చేతిలో పెట్టాడు అతను. మనస్సులో తీసుకోవాలని ఉన్నా చెయ్యి వెనక్కి తీసింది. "వద్దు వద్దు" అరిటూ తొందరగా తోసుకు వెళ్లడంలో, కాగితం చిరిగి పూలన్నీ కిందపడిపోయాయి. ఆ పూలమీదనుంచే పరుగెత్తుకు వెళ్లింది సీత. ఆ ధూళిలో సీత కాలికింద నలిగిన సంపెంగను మాత్రం అతను తీసుకుని నిట్టూరుస్తూ వెనక్కి వెళ్ళాడు.

4

ఆ ఊరికంతా శంకరం అంటే హడలు. ఇరవై ఏళ్లే ఉన్నా 'పెద్దరౌడీ' అని అతనికి పేరు. వీధిలో వస్తున్నాడూ అంటే ఆడ పిల్లలకి భయం. శంకరం అంత దూరంలో ఉండగానే. అతని అత్తరు వాసన గుర్తించి వాళ్లు తప్పుకునేవారు. ఏంచేశాడో, ఏంచేస్తాడో, ఎవరూ చెప్పరు, గాని శంకరం అంటే మాత్రం ఎవ్వరికీ మంచి అభిప్రాయం లేదు. ఓరోజు గుడి పక్కగా వెళుతూ పొగడ చెట్టుకింద పూలు ఏరుకుంటూన్న సీతని మొదట చూశాడు శంకరం, ఎందుకో గాని సీతని చూడగానే అక్కడనుంచి వెళ్లలేక అలాగే చూస్తూ నిలబడి పోయాడు.

ఆ రోజునుంచీ సీత పూలు ఏరుకునే వేళకు సరీగ్గా అతనూ ఆపక్కగా వచ్చి సీత అక్కడనుంచి కదిలే వరకూ చూసేవాడు.

ఒకరోజు సాయంత్రం సీత పూలుకోస్తూ ఉండగా, కంట్లో ఏదోపడి బాధ పడడం చూశాడు శంకరం. ఇంక దూరంగా ఉండలేక దగ్గరగా వెళ్ళి "ఏం పడింది" అన్నాడు మెల్లిగా జంకుతూ. అతన్ని చూసి సంకోచించ కుండానే "కంట్లో ఏదోపడింది" అంది సీత లేనినవ్వు తెచ్చుకుని.

"ఏదీ! ఊదుతాను పోతుంది" అంటూ తల పట్టు కుని కన్ను తెరవమని ఊదాడు శంకరం. ఎలాగయి తేనేం కంట్లోంచి ఒక చిన్న చీమను బయటికి తీస్తూ "ఇంతపెద్ద కళ్లయితే పడతాయి" అన్నాడు నవ్వుతూ శంకరం. సీత సిగ్గుపడింది. అతను కోసియిచ్చిన పూలన్నీ తీసుకుంది. ఎందుకోగాని అతనంటే తెలియని ఇష్టం ఏర్పడ్డది. ఆ రోజునుంచీ అతను పూలు ఇవ్వ డమూ సీత పుచ్చుకోవడము అలవాటయింది. అంచేత 'వద్దు' అని ఆ సాయంత్రం సీత వెళ్లగానే, శంకరం ఆ చెట్టుకిందే చతికిలబడి ఆలోచనలు ప్రారంభించాడు.

ప్రతీ సాయంత్రం సీత నవ్వుముఖం చూడందే అతనికి నిద్రపట్టేదికాదు.

త్వరగా సాయంత్రం అయేదాకా చిరాకు పడిపోయే వాడు. అలాంటిది సీత అలా వెళ్లగానే, సీతకూడా అందరిలాగే అతన్ని చెడ్డవాడని అనుకుంటూందని ఆఖరుకి నిశ్చయించుకున్నాడు. ఆ దురభిప్రాయం పోగొట్టాలని అనుకుంటూ ఇంటికి వెళ్ళాడు.

5

సీత ఇంటికి రాగానే పూలు తేనందుకు పున్నమ్మ సంతోషించింది. సీత మాత్రం చిరాకుగానే ఉంది. సాలోచనగా పడుకున్న సీతని దగ్గిరగావచ్చి పలక రించింది సరోజ.

"అన్నట్లు పూలు ఇచ్చాడా! ఏం జరిగింది! ఏ మన్నావు?" అంది సరోజ భయంతో. "నీ మొహం అతను చాలా 'మంచివాడు'' అంటూ ఆమాటలు మరిపించి పంపింది సరోజను.

దాచుకున్న దండలన్నీ తీసి తెల్లవారగానే చూసు కుంటూన్న సీతని పున్నమ్మగుడికి రమ్మంది. సీత జంకుతూ పున్నమ్మ వెనకాలే అడుగులువేస్తూ ఒకవేళ అతనువచ్చి పలకరిస్తాడేమో అన్న బెదురుతో వెళ్ళింది.

6

పున్నమ్మ గుడిలోపలికి వెళ్ళింది. సీత మాత్రం పొగడ చెట్టుకిందికి వచ్చి, కిందటిరోజు పూలన్నీ కింద పడినచోటు గుర్తించి, వాడిపోయి మన్నులో కలిసిన పూలనిచూస్తూ, అందులో వడిలిపోయి రెక్కలు విరిగిన సంపెంగ కాలికి తగలగానే "ఇవిగో సంపెంగలు" అన్న అతని మాటలు తలుచుకుని, అటూ ఇటూచూసి, ఆ సంపెంగ తీసి, తల్లో పెట్టుకుంది.

"రావే పోదాం" అంటూ పున్నమ్మ పిలవగానే కాళ్ళీడ్చుకుంటా ఇంటికి వెళ్ళిపోయింది.

శంకరం అక్కడే ఉన్న మొండి గోడమీద పొగడచెట్టు గుబురు వెనకాలనుంచి సీతని చూస్తూనే ఉన్నాడు.

ఆ రోజు బడినుంచి మామూలు దారిని గుడివక్కగా కాక, ఇంకోదారిని వస్తూంది సీత. ఓసందు మలుపు తిరగగానే శంకరం ఎదురయాడు. అతన్ని చూడగానే అదుర్దాగా మూలగా ఒదిగి నిలబడింది. ఆ కంగారులో చేతిలో పుస్తకాలు జారి పక్కనే ఉన్న కాలవలో పడ్డాయి. "అయ్యో" అంటూ తీయబోయింది సీత.

"వద్దు నేను ఇస్తాను, ఉండు" అని శంకరం ఆపాడు.

"పుస్తకాలన్నీ బురద అయాయి, అత్త తిడుతుంది" అంటూ, ఇంక మాట్లాడలేక బావురుమంది సీత. ఆ సందులో వెళుతున్న ఒక రిద్దరు ఆగారు సీతఏడుపు విని.

"ఇలారా!" అంటూ సీత చెయ్యి పట్టుకుని ఆ సందులోంచి అవతలకి పిలుచుకు వెళ్ళాడు శంకరం. అతను రమ్మనగానే బెరుకులేకుండా కూడావెళ్ళింది సీత. ఆ దగ్గిరలోనే ఉన్న ఓ గుడిసెలోకి పిలుచుకు వెళ్ళి, "వెంకన్నా" అని పిలవగానే అరవై ఏళ్ళ ముసలి అతను "బాబయ్యా" అంటూ అతి భయభక్తులతోవచ్చి శంకరం ముందు నిలబడ్డాడు. ఆ సందులో కాలవలో పుస్తకాలు తెమ్మని శంకరం అతన్ని పంపాడు.

ఇంక సీత ఏడుపుమాత్రం ఎక్కువయిందే గాని తగ్గలేదు. కళ్ళు వాచిపోయాయి. శంకరం ఎంత ఓదార్చినా సీత సమాధానపడలేదు సరికదా ముఖం మీద చేతులు కప్పుకుని ఏడుస్తూంది.

"సీతా! ఇలాచూడు! అబ్బ ఏడవకు! నీకు పుస్తకాలు తెచ్చి ఇస్తాగా, నువ్వు నవ్వవూ! నవ్వాలి" అంటూ శంకరం లాలించడం మొదలుపెట్టాడు.

"కొత్తవా" అంది సీత అతన్నిచూసి.

"దొంగ! ఇలా చూడు! ఒక్కసారినవ్వు, చాలు. ఏదీ?" అని శంకరం చేతులు పట్టుకున్నాడు.

'ఉఁహుఁ' అని తల తిప్పింది సీత.

"ఏదీ నా సంపెంగ, నీజుట్టులో ఉంది కదూ!" అన్నాడు. ఆ మాట వినగానే ముసిముసినవ్వులు నవ్వింది సీత. నగంమన్ను అయిన పుస్తకాలని తీసుకు వచ్చాడు వెంకన్న. అవన్నీ తుడిచి చేతికియిచ్చి, ఇంటికి వెళ్ళమన్నాడు శంకరం.

సీత నవ్వుతూ గుడిసె ముందుండగానే "వెంకన్నా అందాకా వెళ్ళు" అని సీతదగ్గిరగా వచ్చి జేబులో దాచిన పూలు చేతికి ఇచ్చి "వద్దనకు, నే నివ్వనులే వెంకన్న ఇస్తాడు ఏం?" అంటూ సాగనంపాడు శంకరం.

ఆలస్యానికి ఏదో సాకులుచెప్పి పుస్తకాలు బురదలో జారాయని అబద్ధాలు చెప్పింది అత్తకి సీత "అబ్బ వాడినకొద్దీ వాసన అత్తారు పూలు! నాగది అంతా వాసనే" అంది సీత ముందుగా తానే. అవును అంటూ ఆ సంగతే మరిచిపోయింది పున్నమ్మ. శంకరం చెడ్డవాడుకాడనీ, సరోజ అబద్ధాలు ఆడిందనీ, సీత నిశ్చయించుకుంది.

"నేనివ్వనులే, వెంకన్న ఇస్తాడు" అన్న అతని మాటలు మరీ మరీ తలుచుకుని లోలోపల పొంగిపోతూ అతనెంత మంచివాడో అనుకుంది.

7

సీతకి కష్టం కాగూడదనే నిశ్చయంతో శంకరం వెంకన్న ద్వారా సీతకి పూలు అందచేస్తున్నాడు, స్నేహితురాలు ఇచ్చిందని అత్తతో చెప్పేది సీత. సరోజమాత్రం సీతని ఓకంట కనిపెడుతూనే ఉంది. అత్తకి చెప్తానని సరోజ సీతని అప్పుడప్పుడూ బెదరించేది కూడాను. బతిమాలుకుని ఈసంగతి బయటపడకుండా చేసుకుంది సీత. ఇలా ఒక వారమయేసరికి పూలదండలతో పెట్టె నిండిపోయింది. సీత మనస్సుని మాత్రం ఏదో బాధిస్తూనేఉంది.

ఒకనాటి సాయంత్రం దండతీసుకుంటూ వెంకన్నని అడిగింది సీత "బాబుగారున్నారా" అని.

"జ్వరంగా ఉందమ్మా" అన్నాడు.

"ఎన్నాళ్ళనించీ" అంది ఆదుర్దాగా.



పళ్ళు - ఉపయోగాలు

నిమ్మకాయ: తక్కువ ధరకు లభించినా, చాలా ఉపయోగకరమైన విటమిన్ 'సి' ఉంది. కడుపునొప్పి, నరాల బలహీనత, జలుబు, పైత్యం, జ్వరం, తలనొప్పి, ఆస్మా - వున్నవాళ్లకి మంచిది.

ఏపిల్: కడునొప్పి, జ్వరం, అంటువ్యాధి, బలానికి, శిరోజాల పెరుగుదలకు మంచిది.

ఆరంజి: విటమిన్ ఏ.బి.సి. వున్నాయి. అన్ని రకాల వ్యాధులకు మంచిది. రక్త ప్రసరణకు మంచిది.

అరటి పండు: మూత్ర పిండాలకు, పైల్స్‌కి మంచిది. బి.కాంప్లెక్స్ వుంది. రక్తపోటు తగ్గిస్తుంది.

"రెండురోజుల్నించీ" అంటూ వెళ్ళాడు వెంకన్న.

పూలదండ చేత్తో తిప్పుతూ ఆలోచనలతో సీత ఇంటి వచ్చింది. గుమ్మంలో సరోజ నిలబడింది.

"మరీ చిత్రంగా మారిపోయావే సీతా! మాయింటికి రావడమే మానేశావు?" అంది సరోజ చేతులు తిప్పుతూను. జవాబు చెప్పకుండానే సీత ఇంట్లోకి వెళ్ళి పడుకుంది.

"ఆ శంకరంకోసమే ఈ బెంగంతా" అని సరోజ మెల్లగా సీత చెవిలో అంది.

"ఊరుకుండూ, ఎప్పుడూ ఇదేగొడవ" అని సీత విసుక్కుంది.

"ఎందుకలా ఉన్నావు అత్తతో చెప్పనా! చెప్పనులే, పూలు ఇవ్వలేదా ఇవాళ?" అని నవ్వుతూ సరోజ వెళ్ళిపోయింది.

ఎందుకో జడరిబ్బను తీసి ముక్కలు ముక్కలుగా చించి పారేస్తూ సీత కూచుంది.

8

మామూలు వేళకి వెంకన్న సీతకి పొగడదండ అందించాడు. సీత ఉండలేక "బాబయ్యగారికి జ్వరం తగ్గిందా" అంది మెల్లిగా.

"తగ్గిందమ్మా గుడికి వస్తారు రేపు సాయంత్రం" అంటూ వెంకన్న వెళ్ళిపోయాడు.

ఎప్పుడు వస్తారో అడగలేదే అనుకుంటూ ఇంటిదారి తీసింది సీత.

అత్త కోసరం దీపం దగ్గిర కూచుని పుస్తకం తీసింది. కాని చదవాలని దృష్టి ఉంటేగా. ఆ రాత్రి చదువులేదు, నిద్రాలేదు. మర్నాడు సాయంత్రం ఎలా వచ్చిందీ మామూలుగా అత్తకి అబద్ధాలు చెప్పి గుడికి దారి తీసింది. సీతకోసరం చూస్తున్న శంకరం ముందుకు వచ్చి కోనేరు వైపు దారితీశాడు. అక్కడ చిన్న అరుగు మీద కూర్చున్నారు. సీత సందేహిస్తూ నిలబడింది.

"కూచో సీతా ! కూచోవూ, నా సంగతి అడిగావని విని వచ్చాను. జ్వరం తగ్గలేదు ఇంకాతెలుసా! అడిగావా సీతా" అన్నాడు నవ్వుతూ.

"అడిగాను" అంటూ అతని పక్కనే సీత కూచుంది. జేబులోంచి పొగడదండ తీసి శంకరం సీత ఒళ్ళో పెట్టాడు. సీతకి ఒళ్ళు తెలియలేదు. ఎందుకో శంకరం షర్టు చేతిగుండీలని తిప్పుతూ అతని కళ్లల్లోకి చూసింది.

"సీతా ! నన్ను మరిచిపోవు కదూ"

"ఉహూ' అన్నట్లు తలతిప్పింది.

"త్వరగా వెళ్లాలి. అత్తకోప్పడుతుంది" అంది సీత.

"ఒక నిమిషం ఇలానే కూచో సీతా ! ఇలా దగ్గరగా, సీతా నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా?"

"అతనిచేతిని దగ్గరగా తీసుకుంది సీత. ఆ మాట అనగానే ఏమయిపోయాడో శంకరం, సీతని మరీదగ్గరగా, దగ్గరగా తీసుకుని "నీవు ఇంకెవ్వరినీ పెళ్ళిచేసుకోకూడదు సీతా" అన్నాడు శంకరం.

ఇంతలో ఏదో అలికిడి అయి సీతలేచి తొందరగా ఇంటివైపు నడిచింది. ఇంటిపనులన్నీ ఆ రాత్రి ఎప్పటికంటె ముందే ఎంతోబాగా చేసి సీత అత్త దయ సంపాయించుకుంది.

9

పున్నమ్మ అసాధ్యురాలు. ఎలాపసికట్టిందో ఏమో, ఎవరన్నా చెప్పారో! స్వగ్రామమైన సంతమాగులూరికి ప్రయాణం కట్టింది. సీత గుండెల్లో రాయిపడిపోయింది.

ఏం చేస్తుంది?

ఆ సాయంత్రం శంకరాన్ని కలుసుకుంది. తన ఊరి ప్రయాణం సంగతి ఎత్తలేదు. చెబితే బాధపడతాడనీ, ఆపుతాడనీ అల్లరవుతుందనీ అతని అప్పటిస్థితి చూడలేకో అంతబాధ తానే అనుభవించి ఊరుకుంది.

శంకరానికి మాత్రం ఏం తోచిందో? "ఏం సీతా ఇవాళ అలాగ ఉన్నావేం?" అని అడిగాడు.

"ఏమీలేదు" అని ఇంక ఉండబట్టలేక సీత ఏడవడం మొదలెట్టింది.

ఏమీ అర్థంకాక శంకరం మళ్ళీమళ్ళీ అడిగాడు, బతిమాలుకున్నాడు, బుజ్జగించాడు.

"రేపు రెండుదండలు తెస్తాను, తెలుసా! ఒకటి నేను నీ మెళ్లో వేస్తాను! రెండవది నువ్వు నామెళ్ళో వేయాలి" అన్నాడు శంకరం నవ్వుతూ. సీత నవ్వి

"అలాగే" అంది.

ఆ కొత్త చీకట్లో ఆ నవ్వులో వెలితీ వేదన శంకరానికి కనపడలేదు.

"సీతా ! రేపు వస్తావుకదూ, త్వరగా రా."

"ఆ".

10

సంతమాగలూరులో తాతగారి ఇంట్లో తోచకండా ఉంది సీతకి.

ఎప్పుడూ పెండ్లి సంబంధాలు సంగతే ఇంట్లో అందరూ మాట్లాడు కోవడంచూసి సీతకి మరీ మతిపోవడం మొదలుపెట్టింది.

సీత మనస్సులో బాధ గుర్తించేవారెవరు ? గుర్తించినా తీర్చేవారెవరు ?

అనుకోకుండానే పెండ్లి చూపులు జరిగాయి. పెండ్లి కొడుకు ఎవరైనా సరే అన్న నిశ్చయంతో నిస్పృహతో కొయ్యబారిపోయింది సీత.

"మా సీత అమాయకురాలు. మంచిఇంట్లో పడుతూంది" అంటూ పున్నమ్మ అందరితో చెప్పింది.

పెండ్లి నిశ్చయమయిందని తెలియగానే సీత మరీ బెంగపెట్టుకుంది. హడావిడిగా ఒక్కరోజులో సీత పెళ్ళి జరిగింది. ఎలా జరిగిందో ఏమిటో ఏం తెలియకుండా యంత్రపు బొమ్మలాగా పున్నమ్మ ఏం చేయమన్నా చేసింది సీత. పొగడదండమాత్రం తల్లో పెట్టుకుంది. పెళ్ళి కొడుకు కాస్త చదివినవాడు, బాగా డబ్బుకలవాడు. అదే పున్నమ్మకి కావలసింది.

"అబ్బ! మూడు ముళ్ళూ పడ్డాయమ్మా మా సీతకి" అంటూ చాటంతముఖంతో ఆనందపడింది పున్నమ్మ. సీత అత్తవారి ఇల్లు తాతగారి ఇంటి దగ్గిరే అని బంధువులందరూ మరీ సంతోషించారు.

ఆస్తి ఉందిగాని పెళ్లికొడుకు పిల్లకుతగిన వాడుకాదు. అదీ గాక ముప్పయి ఏళ్లు ఉన్నాయని అందరూ చాటుగా అనుకున్నారు.

"నీకు నచ్చినవాడిని తెచ్చాను, మోయలేనన్ని నగలు" అంది పున్నమ్మ ఓరోజున సీతతో.

"పిచ్చాళ్ల బస్తా లాగున్నాడు" అంది సీత తలవంచుకుని. ఆమాటకు ఆరోజంతా గింజుకుంది పున్నమ్మ.

వంపెడునగలతో, పట్టుచీరెతో సీత కళకళ లాడుతూ కనపడింది అందరికళ్ళకీని.

"ఎంతనెమ్మది, వంచిన తలే ఎత్తట్లేదమ్మా" అనుకున్నారు అత్తవారు. ఎవరుఎన్ని అనుకున్నా మంత్రలతో ఎన్నిముళ్లు వేయించినా సీతమనస్సులోంచి శంకరంపోలేదు. అతను భర్తకాలేదనే లోబాధతో లోపల కృశిస్తూనే ఉంది సీత.

పెళ్ళిఅయిన మూడు నెలలకి మళ్ళీ గుంటూరుకి సీతని పిలుచుకువచ్చింది పున్నమ్మ. ఊరుచేరిన ఉదయం సరోజఇంట్లోనే ఉండిపోయారు. పెళ్ళి కబుర్లన్నీ పున్నమ్మ సంబరంతో ఇరుగుపొరుగువారికి చెప్పింది. సరోజ మాత్రం సీతని చూడగానే గ్రహించింది. సరోజ ఇంకా బడికి వెళుతూన్నందుకు సీత సంతోషించింది

ఎవ్వరూలేని సమయంచూసి సీత సరోజని అడిగింది.

"అతను ఎప్పుడన్నా కనిపించాడా, సరోజా !"

శంకరం అని గ్రహించి సీత దగ్గరగా వచ్చి రహస్యంగా "కనిపించడమేమిటి? బడిచుట్టూ తిరిగి తిరిగీ పాపం చివరికి ఆ పొగడచెట్టుకింద కూచుంటున్నాడు." "నిజంగా?" అంది ఆదుర్దాగా సీత.

"నీకు పెళ్లయిందని తెలుసు. ఎవరు కనిపించినా సరే 'నా సీతకి పెళ్ళయిందా? ఇవిగో దండలు' అంటూ పిచ్చిగా తిరుగుతున్నాడు.

"తిరగడమే?" అంది సీత కన్నీళ్ళతో.

"తిరగడమేమిటి! ఇల్లువాకిలి అంతా వదిలి ఆ చెట్టుకింద పడివుంటున్నాడు. ఎవరూ ఆ పక్కకే వెళ్ళరు. అందరికీ భయం అతనంటే" అని సరోజ తలవంచుకుంది.

సీత ఇంక వినలేక సరోజ ఒళ్లోపడి ఏడ్చింది.

ఎలా సమాధానపరచాలో తెలియక సరోజకూడా ఏడుపు ప్రారంభించింది.

"మూడు నెలలకే అంతఏడుపులా? ఆడపిల్లలు కారుటే!" అంటూ పున్నమ్మ వచ్చింది.

ఆ రోజంతా సీత లేవలేదు. సరోజకి తప్ప సీతబాధ

ఆ సమయంలో..

మొటిమలకు, బహిష్టు సమయంలో ఏర్పడే నొప్పికి మంచి మందు - నక్క దోసకాయ. (కుకుంబర్)

* * *

మామిడి టెంక లోపలి గింజ తీసి చిన్న చిన్న ముక్కలుగా చేసి తేనెలో వేసి, ఒక టీ స్పూన్ వారం రోజులు తాగితే బహిష్టు సమయంలో వచ్చే రక్తంపోవడం, నొప్పులు తగ్గుతాయి.

* * *

బహిష్టు ఒక్కొక్క సారి 28 రోజుల ముందు, వెనుకగా వస్తుంది. అలాంటప్పుడు ద్రాక్షరసం ఉదయం, సాయంత్రం ఒక్కొక్క గ్లాసు తాగితే మంచిది.

ఇంకెవరికీ తెలియదు. ప్రయాణబడలిక అని పున్నమ్మ అనుకుంది.

11

సీత శంకరాన్ని చూడాలనే ఆశతో "గుడికి వెళతాను, అత్తా" అంది

"ఒక్కదాని వీనా? వద్దు పిచ్చివాడున్నాడుట, అందరం వెళదాంలే" అంది పున్నమ్మ. ఆమాటవిని నీరైపోయింది సీత.

ఆ సాయంత్రం 3 గంటలకి పళ్ళెంలో పూలు, పళ్ళు, కొబ్బరికాయ పెట్టి సీతచేతికి ఇచ్చి సరోజతోసహా పున్నమ్మ గుడికి వెళ్ళింది.

పొగడచెట్టు కింద వంగి నేలమీద పూలుగుచ్చుతూన్న శంకరాన్ని సీత చూసింది. "అతనే" అని సరోజ చేయి చూపింది.

నేలమీద మన్నంతా పూలు అనుకుని పోగుచేస్తున్నాడు శంకరం.

"అదుగో పిచ్చివాడు త్వరగా రండి" అంది పున్నమ్మ తొందరతో.

ఆమాట విని సీతచేతిలో పళ్ళెం వదిలేసింది. పళ్ళెం చప్పుడుతో శంకరం తలెత్తి చూచాడు.

కిందపడిన పూలు తీస్తూ పున్నమ్మ సీతని విసుక్కుంటూ ఉంది. సీత మాత్రం శంకరాన్ని తప్ప ఇంకేమీ చూచే స్థితిలో లేక అలానే నిలబడి పోయింది.

"మతిపోయిందా కదలదేం? పదండి" అంది పున్నమ్మ. పున్నమ్మ కేకతో శంకరం ముందుకువచ్చి.

"ఆ... నావి ఆ పూలన్నీ. ఏరకండి చంపేస్తా" అంటూ వచ్చాడు.

"తీసుకో నీవయితే" అంటూ వణికింది పున్నమ్మ. సరోజ పున్నమ్మ వెనకాల దాక్కుంది.

"ఈ చెట్టు పూలన్ని నావి" అంటూ కింద పూలు మన్ను అంతా పోగుచేస్తూ శంకరం సీత పాదాలని చూసి లేచాడు.

"నాసీతకి పెళ్లయిందా" అన్నాడు పెద్దగా నవ్వుతూ. ఆ నవ్వుతో అందరూ భయపడి ముందు అడుగువేశారు. సీతమాత్రం కదలకుండా నిలుచుంది అతన్ని చూస్తూను.

శంకరం దగ్గరగా వచ్చి "నా సీతవా నువ్వు" అన్నాడు చెయ్యి పట్టుకుని.

పున్నమ్మ "అయ్యో రావే" అని అరిచింది. ఆ అరుపుతో అందరూ గుంపుకూడారు.

"నా సీతవే. ఇవిగో పూలు, ఎన్నో వున్నాయి ఇంకా, ఇవిగో రెండు దండలూ నా మెళ్ళోనే ఉన్నాయి" అంటూ అక్కడ ఉన్న మన్ను గడ్డీ అంతా సీత తల నిండా పోశాడు శంకరం.

"రావే రావే కదలవేం" అని పున్నమ్మ ఏడుపు ప్రారంభించింది. పున్నమ్మ అరుపులు విని శంకరం సీతని ఎత్తుకుని కోనేటి దగ్గరికి పారిపోయాడు. సీత రెండుచేతులతో అతని కంఠాన్ని చుట్టివేసుకుంది తిన్నగా ఆ గట్టుదగ్గరికి వెళ్ళి ఆ రాయిమీదే కూచుని తన ఒళ్ళో సీతని దాచుకున్నాడు శంకరం.

ఇంతలో జనం మూగారు. అరుస్తున్నారు.

పున్నమ్మ "రావే తల్లీ" అని ఒకటే ఏడుపు.

ఆగోలవినకండానే "ఏదీ! నవ్వు సీతా ! వచ్చావా? ఇవిగో రెండు దండలు. ఒకటి నాకు వెయ్యి!" అంటూ సీత ముఖం నిండా ముద్దులతో నింపేశాడు శంకరం. సీత భయంతో "వదులు వాళ్ళు కొడతారు నిన్ను" అని ఒళ్ళోంచి లేవపోయింది.

"ఆ నిన్ను వదలను. నా సీతవి, నా కోనేరు, నా కోనేరు, నాచెట్టు, వెళితే రావు" అంటూ మరీదగ్గరగా గట్టిగా తనచేతుల్లో బిగించుకుని గుండెలకి అదుముకుని వెర్రి సంతోషంతో ఉన్నాడు శంకరం.

పోలీసులు, జనము అంతా గుంపుగా అతనిచుట్టూ చేరారు. ఆ పెద్ద గుంపు చూసి సీత అతని చేతుల్లోంచి తప్పించుకుని ఢబాలుమని కోనేటిలోకి దూకింది. జనంఅంతా నీటి ఒడ్డుకి చేరారుగాని సీత మాత్రం తేలలేదు. పున్నమ్మ ఏడుపుతో కోనేరంతా ప్రతిధ్వనించింది. అంతేగాని సీత మాత్రం దొరకలేదు.

పిచ్చి శంకరంమాత్రం ఎప్పుడూనవ్వుతో ఆ పొగడ చెట్టుకిందే కూచుని కోనేటివంకే చూస్తూ ఉంటాడు. ఎంతమంది ఎన్ని చిన్నరాళ్ళు రువ్వినా హేళన చేసినా శంకరం పొగడ పూలదండలు కట్టడం మాత్రం మానలేదు. ఇంకా సీత వస్తుందనే అతని ఆశ!